సాక్షి
మహబూబ్‌నగర్

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



ముగిసిన అభయుడి బ్రహ్మోత్సవాలు

ఊర్కొండ: ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం చక్రతీర్థ స్నానంతో ముగిశాయి. చివరిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, అనంతరం కోనేరులో స్వామివారి ఉత్సవమూర్తికి చక్రస్నానం అనంతరం సిద్ధి వినాయక మండపం వద్ద పూజలు జరిపారు. ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు.



పాలమూరులో ఊర్వశి రౌతేలా సందడి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం క్లాక్ టవర్ సెంటర్‌లో శనివారం సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 39వ షోరూమ్‌ను ప్రముఖ సినీనటి, డాకు మహారాజ్ ఫేమ్ ఊర్వశి రౌతేలా ప్రారంభించారు. షోరూం అంతా తిరిగిన ఆమె పలు వస్త్రాలను పరిశీలించారు. హీరోయిన్‌ను చూసేందుకు షోరూం వద్ద జనం కిక్కిరిసిపోయారు. ఈ సందర్భంగా ఆమె అభిమానులకు అభివాదం చేసి సినీ పాటలకు డాన్స్ చేస్తూ హోరెత్తించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సౌత్‌ఇండియా షాపింగ్‌మాల్ సంస్థ డైరెక్టర్లు సురేశ్ సీర్ల, అభినయ్, రాకేష్, కేశవ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పీయూ అధ్యాపకుడికి డిజైన్ పేటెంట్ రైట్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఎంబీఏ విభాగ అధ్యాపకుడు అర్జున్‌కుమార్ స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్‌పై డిజైన్ విభాగంలో పేటెంట్ రైట్ పొందారు. ఈ మేరకు పరికరం రూపకల్పనలో మొత్తం ఆరుగురు అధ్యాపకులు పాల్గొన్నారని అర్జున్‌కుమార్ పేర్కొన్నారు. ఇది పూర్తిగా ఏఐ ఆధారిత పరికరం అని, ఆర్థిక పరమైన వార్తలు, మార్కెట్ డేటా, సోషల్ మీడియా సెంటిమెంట్ వంటి అంశాలను విశ్లేషించి స్టాక్ మార్కెట్‌ను అంచనా వేస్తుందని, మెషిన్ లర్నింగ్, అల్గారిథం వంటి అంశాలను విశ్లేషిస్తుందన్నారు. మార్కెట్ పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఇది అంచనాలు, సిఫార్సులను చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పేటెంట్ రైట్‌ను సాధించిన వారిని ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, కుమారస్వామి, నాగసుధ, రవికుమార్, గాలెన్న, చంద్రశేఖర్, సుదర్శన్‌రెడ్డి, జిమ్మికార్టన్, వెంకటరాఘవేందర్ పాల్గొన్నారు.

గంగాపురం జాతరకు ప్రత్యేక బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రథసప్తమిని పురస్కరించుకొని ఈ నెల 3 నుంచి 5 వరకు గంగాపురం జాతరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 15 ప్రత్యేక బస్సుల ద్వారా దాదాపు 150 అదనపు ట్రిప్‌లను మహబూబ్‌నగర్ డిపో నుంచి గంగాపురం జాతరకు నడుపుతామని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

జిల్లాలో సౌరశక్తి ఉత్పత్తికి అవకాశం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో సౌరశక్తి ఉత్పత్తి చేసి ఆదాయం పొందే విధంగా కేంద్ర ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేష్ తెలిపారు. 4 వేల మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ద్వారా విద్యుదుత్పత్తి లక్ష్యంలో భాగంగా జిల్లాలోని రైతులు తమ బంజరు, వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు 5 కి.మీ., పరిధిలో ఉన్న భూముల్లో 500 కిలోవాట్ల నుంచి 2 మెగా వాట్ల వరకు ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ నిర్ణయించిన టారిఫ్ ప్రకారం ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేస్తాయన్నారు. ఇందుకోసం ఆసక్తి గలవారు ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

● కరుణించని.. నిర్మలమ్మ



పాలమూరుకు మొండిచేయి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి కూడా కరుణించలేదు. సాగునీటి ప్రాజెక్టులు, పర్యాటక రంగ అభివృద్ధి, మాచర్ల– గద్వాల రైల్వేలైన్‌తో పాటు కొత్త మార్గాలు, నూతన నవోదయ పాఠశాలల మంజూరు ఇలా ఏ ఒక్క దానికి శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో పైసా విదిల్చలేకపోయారు. ఫలితంగా అన్నిరంగాల్లో వెనకబడిన ఉమ్మడి పాలమూరుకు మరోసారి మొండిచెయ్యే ఎదురైంది. అయితే వేతన జీవులకు రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు, రైతాంగానికి కిసాన్ క్రెడిట్ కార్డులపై రూ.5 లక్షల వరకు రుణం, స్వదేశీ వస్తువులపై పన్ను మినహాయింపు ఇవ్వడం ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు, రైతులు, చేనేత కార్మికులకు కొంత ఊరట కల్పించినట్లయింది.

– సాక్షి, నాగర్‌కర్నూల్

- ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు తప్పని భంగపాటు
- పర్యాటక రంగ అభివృద్ధికి లభించని చేయూత
- ఊసేలేని మాచర్ల– గద్వాల, కొత్త రైల్వే మార్గాలు
- రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపుపై హర్షాతిరేకాలు
- కిసాన్ క్రెడిట్ కార్డుతో 5.50 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- స్వదేశీ దుస్తులకు పన్ను తగ్గింపుతో 4,600 చేనేత కార్మికులకు మేలు
- ఈసారి నిరాశే మిగిల్చిన కేంద్ర బడ్జెట్

ఉమ్మడి జిల్లాకు జీవనాడిగా మారే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాతోపాటు ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను కేంద్రం అందించాలన్న డిమాండ్ ఉండగా.. బడ్జెట్‌లో దీనిపై ప్రస్తావనే కరువైంది. దీంతో ఈ ప్రాజెక్ట్ పూర్తిచేయాల్సిన భారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వంపైనే పడింది. అలాగే ఉమ్మడి పాలమూరులోని కొత్త జిల్లాలకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాల మంజూరుపై ఆశలు పెట్టుకోగా నిరాశే ఎదురైంది. ఉమ్మడి జిల్లాలోని పురాతన, ప్రముఖ దేవాలయాలకు ప్రసాద్ స్కీం పథకం కింద కేంద్రం నుంచి నిధులు అందుతాయని ఆశించినా ఎలాంటి ప్రయోజనం దక్కలేదు. ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నప్పటికీ నిధుల కేటాయింపు లేకుండాపోయింది.

సులభంగా రుణాలు..



వ్యవసాయ రంగంలో సాంకేతికత పెంచడం, వలసలు తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం కొత్త నిర్ణయాలు తీసుకుంది. పంటల ఉత్పాదకత, నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు పంచాయతీ, బ్లాక్ స్థాయిల్లో గోదాంలు, నీటి పారుదల, రుణ సౌకర్యాలను మరింత పెంచాలని నిర్ణయించింది. అలాగే రైతుల పెట్టుబడి కోసం అధిక వడ్డీ రేట్లకు అప్పులు చేయకుండా కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచింది. దీని ద్వారా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5.50 లక్షలకు పైగా రైతులకు ప్రయోజనం కలగనుంది. వ్యవసాయం, మత్స్య, పశుసంవర్ధక రంగాల్లో ఖర్చులు, పరికరాల కొనుగోలు కోసం రైతులు స్వల్పకాలిక రుణాలు పొందవచ్చు. రానున్న ఐదేళ్లపాటు పత్తి పంట ఉత్పాదకత పెంచేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఇందుకోసం పత్తి పంట మద్దతు ధర పెంచేందుకు అవకాశం ఉంది.

చేనేత కార్మికులకు దన్ను..



ముఖ్యంగా మేక్ ఇన్ ఇండియా పథకంలో భాగంగా దేశంలో తయారైన స్వదేశీ దుస్తులకు పన్ను మినహాయింపు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాలోని గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాలో ఉన్న మర మగ్గాల కార్మికులకు మేలు జరగనుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 4,600 మంది చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. స్వదేశీ దుస్తులకు పన్ను మినహాయింపుతో చేనేత దుస్తుల ధరలు తగ్గనున్నాయి. కాగా.. పొగాకు, సిగరెట్లపై పన్నులను కేంద్రం పెంచడంతో వాటి ధరలు మరింత పెరగనున్నాయి.

ప్రధానికి కృతజ్ఞతలు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ముమ్మాటికీ ప్రజా ఆమోద బడ్జెట్. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలకు, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. ప్రధానంగా ఆదాయపు పన్నులో రూ.12 లక్షల వరకు మినహాయింపు ఇవ్వడం శుభపరిణామం. పారిశ్రామిక, ఉత్పాదక రంగాలకు ప్రోత్సాహకాలు ఇచ్చారు. ప్రజలకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రధాని మోదీతోపాటు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు. – డీకే అరుణ, ఎంపీ, మహబూబ్‌నగర్

వినతులు బుట్టదాఖలు



పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని, నిధులు కేటాయించాలని చేసిన మా వినతులు బుట్టదాఖలయ్యాయి. కనీసం మా విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోకపోవడం బాధాకరం. తెలంగాణ నుంచి కేంద్రానికి ప్రజలు ఏటా రూ.లక్ష కోట్ల వరకు పన్నులు కడుతున్నారు. కానీ, కేంద్రం మాత్రం రాష్ట్రానికి ఏమీ ఇవ్వడం లేదు. – మల్లురవి, ఎంపీ, నాగర్‌కర్నూల్

విభజన చట్టం ప్రకారం



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బడ్జెట్‌లో చూపించిన వివక్ష స్పష్టంగా కనిపిస్తుంది. వెనకబడిన పాలమూరు నుంచి ఎన్నికైన ఎంపీ డీకే అరుణ బడ్జెట్‌లో జిల్లాకు ఏమీ తీసుకురాలేదు. రాష్ట్రంలో చేపట్టిన ట్రిబుల్ ఆర్, మెట్రో రైల్, ఎయిర్ పోర్టుల గురించి ప్రస్తావించలేదు. విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులు కూడా కేటాయించలేదు. – మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

జాతీయ హోదా ఏది..?



పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులు కేటాయింపులు చేస్తారని అనుకున్నా ఎక్కడా ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రతిసారి ఈ విషయంలో మొండిచేయి చూపుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు భారీ కేటాయింపులు ఉంటాయని ఆశించినా మళ్లీ నిరాశే ఎదురైంది. తెలంగాణను కేంద్రం చిన్నచూపు చూస్తోంది. – అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

గ్రామీణాభివృద్ధికే ప్రాధాన్యత..



కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగం తర్వాత గ్రామీణాభివృద్ధికే అత్యధిక శాతం నిధులు కేటాయించింది. ఈ మేరకు మొత్తం రూ.2,66,817 కోట్ల కేటాయింపులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం కోసం వెచ్చించనుంది. దీంతో గ్రామాలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారానికి వేగంగా అడుగులు పడనున్నాయి. ఆ తర్వాత వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి విరివిగా రుణాలు మంజూరు చేయనున్నారు. అంగన్‌వాడీ పోషణ్ 2.0 ప్రాజెక్ట్ ద్వారా చిన్నారులకు పోషకాహారం పెంచడంతో పాటు మరింత సమర్థవంతంగా సేవలు అందించేలా చర్యలు తీసుకోనున్నారు. అన్ని జిల్లాకేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 'డే కేర్ కేన్సర్ సెంటర్స్' ఏర్పాటు చేయనున్నారు.

గొప్ప విషయం..



కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను రూ.12 లక్షలకు పెంచడం గొప్ప విషయం. మేక్ ఇన్ ఇండియాకు ప్రోత్సాహకం, మౌలిక రంగం, సుస్థిర అభివృద్ధి, స్టార్టప్స్, మీడియం, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీకి ప్రోత్సాహకం ఇవ్వడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. వ్యవసాయం, పేద, మధ్య తరగతి వారికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది. – గద్దం జిమ్మీకార్టన్, హెచ్‌ఓడీ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్, పీయూ

వేతన జీవులకు వరం..



కేంద్ర బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు స్లాబ్ పెంచడం వేతన జీవులకు ఒక వరం లాంటింది. గతంలో రూ.7 లక్షలు దాటితే గతంలో రూ.80 వేలు ట్యాక్స్ చెల్లించేవారు. కానీ ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేదు. దీంతో వేతన జీవులు, మధ్య తరగతి వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇంత మంచి నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. – సునీల్‌కుమార్, తపస్ జిల్లా అధ్యక్షుడు

'విద్యానిధి'కి స్వచ్ఛందంగా విరాళాలు



కలెక్టర్ విజయేందిరకు విద్యానిధికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యానిధికి పలువురు స్వచ్ఛందంగా విరాళాలు అందజేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పలువురు దాతలు కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిరను కలిసి విద్యానిధి కోసం చెక్కులు అందజేశారు. మున్సిపల్ కాంట్రాక్టర్లు, మెప్మాకు చెందిన ఆర్పీలు 8 మంది కలిసి రూ.3.37 లక్షల చెక్కులు అందించారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి విద్యానిధికి దాతల ద్వారా నిధులు సేకరిస్తున్నామన్నారు. ఈ మేరకు గత నెలలో సుమారు రూ.8.50 లక్షలు దాతలు అందజేశారన్నారు. విద్యకు సంబంధించి, పాఠశాలల్లో వసతులు, పేద విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు విద్యానిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ సంవత్సరం విద్యానిధి ద్వారా రూ.2 కోట్లు సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ నెలలో సుమారు రూ.40 లక్షలు విద్యానిధికి దాతల ద్వారా వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యానిధిలో ఉద్యోగులు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి చిన్నారుల ప్రాణం తీసిన నీటిగుంత

- రిజర్వాయర్ గుంతలో పడిపోయిన అక్కాతమ్ముడు
- బాలిక మృతదేహం లభ్యం.. లభించని బాలుడి ఆచూకీ



భాగ్యలక్ష్మి, మహేశ్ (ఫైల్)

జడ్చర్ల: తల్లి పొలం పనుల్లో నిమగ్నమవగా.. ఆడుకుంటూ వెళ్లిన వారి ఇద్దరు చిన్నారులు రిజర్వాయర్ నీటి గుంతలో పడి దుర్మరణం పాలయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్‌లో చోటుచేసుకున్న ఈ విషాదకర సంఘటనకు సంబంధించి సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం వివరాలిలా.. ఉదండాపూర్ గ్రామానికి చెందిన మల్లేష్, పార్వతమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కూతురు భార్గవి హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుంది. ఇక చిన్న కూతురు భాగ్యలక్ష్మి(6), కుమారుడు మహేశ్(4) తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. శనివారం తల్లి పార్వతమ్మ తన ఇద్దరు పిల్లలను వెంట బెట్టుకుని వ్యవసాయ పొలం వద్దకు చేరుకుని పనుల్లో నిమగ్నమయ్యింది. అక్కాతమ్ముడు ఆడుకుంటూ పక్కనే కొద్ది దూరంలో ఉన్న నీటి గుంత వెంబడి వెళ్తూ ప్రమాదవశాత్తు జారీపడ్డారు. కొద్దిసేపటి తర్వాత తల్లి పార్వతమ్మ పిల్లల కోసం గాలించగా నీటి మడుగులో కూతురు మృతదేహం తేలడంతో గమనించి లబోదిబోమంది. చుట్టుపక్కల వారు వచ్చి నీటిలో నుంచి బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. బాలుడి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇద్దరు పిల్లలు దుర్మరణం చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహం వెలికి తీతకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా ఉదండాపూర్ రిజర్వాయర్ పనులకు పెద్దఎత్తున గోతులు తవ్వారని, గోతుల్లో నిలిచిన వర్షపు నీటిలో పడి పలువురు మృతిచెందారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్రిప్టో మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మహబూబ్‌నగర్ క్రైం: క్రిప్టోకరెన్సీ పెట్టుబడుల మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిప్టో కరెన్సీ పేరు మీద పెరుగుతున్న మోసాలు, పిరమిడ్ స్కీంలు, నకిలీ ఎక్స్ఛేంజీలు, మోసపూరిత ప్రారంభ నాణేలు, ఆఫర్ల పేరిట మోసం చేస్తున్నారని తెలిపారు. అనవసర ఆఫర్ల కోసం తెలియని వ్యక్తుల నుంచి వచ్చే క్రిప్టో పెట్టుబడి ఆహ్వానాలను విశ్వసించరాదని, నకిలీ వాలెట్‌లు నమ్మరాదన్నారు. ప్రజలు ఎవరూ కూడా క్రిప్టో పెట్టుబడి మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చాలామంది అధిక లాభాల ఆశజూపే ఏ స్కీం అయిన నిజం కాకపోవచ్చని, తెలివిగా ఆలోచించి అలాంటి వాటికి దూరంగా ఉండాలని కోరారు.

30 పోలీస్ యాక్ట్ అమలు

జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని శనివారం నుంచి మార్చి 1 వరకు జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ జానకి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో డీఎస్పీ లేదా ఇతర పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎలాంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు చేయరాదన్నారు. నిషేధిత ఆయుధాలు, తుపాకులు, పేలుడు పదార్థాలను వాడరాదన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు.

కందుల ధర రూ.7,039

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈ టెండర్లలో కందులు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,039, కనిష్టంగా రూ.6,853 ధరలు లభించాయి. సీజన్ లేకపోవడంతో కేవలం కందులు మాత్రమే మార్కెట్‌కు అమ్మకానికి వచ్చాయి.

కొత్త పింఛన్లు ఎప్పుడో..?

- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- ప్రజాపాలన సభల్లోనూ దరఖాస్తుల స్వీకరణ



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్ రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు ఎప్పుడు ఇస్తారోనని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా ఆసరా (చేయూత) కింద రూ.4 వేలు ఇవ్వడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ వర్గాలకు ఇస్తున్న పింఛన్ మొత్తానిన రూ.2,016 నుంచి రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ, ఇప్పటి వరకు ఎన్నికల హామీని అమలు చేయకపోవడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు అర్హులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా ప్రభుత్వం వెబ్‌సైట్‌ను నిలిపివేసింది. ఆసరా పింఛన్ అర్హత వయసు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 65 నుంచి 57 ఏళ్లకు తగ్గించి, 2021 ఆగస్టులో దరఖాస్తులు స్వీకరించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందించారు. పింఛన్లు మంజూరు చేయాలని వృద్ధులు, దివ్యాంగులు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలోనూ ఫిర్యాదులు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల్లోనూ పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

జిల్లాలో 1,00,759 మంది..

జిల్లాలో 1,00,759 మంది ఆసరా లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో వృద్ధులు 35,380, వితంతువులు 42,714, దివ్యాంగులు 13,238, ఒంటరి మహిళలు 4,288, హెచ్‌ఐవీ బాధితులు 2,200, ఫైలేరియా బాధితులు 49, డయాలసిస్ వ్యాధిగ్రస్తులు 111, గీత కార్మికులు 621, చేనేత కార్మికులు 442, బీడీ కార్మికులు 1,716 మంది చొప్పున ఉన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా రూ.24,73,50,960 పింఛన్ల రూపంలో అందజేస్తుంది. జిల్లాలో వేలల్లో కొత్తగా ఆసరా పింఛన్లకు అర్హులు ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. కాగా ఆసరా పింఛన్ పథకంలో భాగంగా ప్రతినెలా దివ్యాంగులకు రూ.4,016 ఇస్తుండగా.. వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలు, చేనేత, బీడీ కార్మికులు, బోధకాలు, ఎయిడ్స్, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు రూ.2,016 చొప్పున అందిస్తున్నారు.

> **సమాచారం లేదు..**
>
> ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటున్నాం. పింఛన్ పెంపుపై ఇంకా మాకు ఎలాంటి సమాచారం లేదు. ప్రస్తుతం పాత పద్ధతిలోనే పింఛన్లు ఇస్తున్నాం. కొత్తగా మంజూరైనప్పుడు ముందుగా ప్రభుత్వమే ప్రకటిస్తుంది. – నర్సింహులు, డీఆర్‌డీఓ

చదువులకు దూరమవుతున్న పేద విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. కోఠారి కమిషన్ సూచన మేరకు కనీసం 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కురుమూర్తిస్వామి హుండీ ఆదాయం రూ.14,97,672



చిన్నచింతకుంట: శ్రీకురుమూర్తిస్వామి ఆలయంలో అమావాస్య, శని, సోమవారాలను పురస్కరించుకొని తరలివచ్చిన భక్తులు కానుకలుగా సమర్పించిన హుండీ డబ్బులను శనివారం లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.14,97,672 వచ్చినట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, భాస్కరాచారి, నాగరాజు, శేఖర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

గద్వాల క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. కేటీదొడ్డి మండలానికి చెందిన వీరన్న(38) బైక్‌పై గద్వాలకు వచ్చి తిరిగి వెళ్తుండగా గోనుపాడు గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వీరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య అనంతమ్మ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సతీమణి జ్యోతి, బీఆర్ఎస్ నాయకుడు హనుమంతునాయుడు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చికిత్సపొందుతూ మరొకరు..

నవాబుపేట: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మరికల్ గ్రామానికి చెందిన కటికే నగేష్(36), అన్నదమ్ముల మధ్య కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పొలం వద్ద గత నెల 30న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో భార్యకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. ఆమె చుట్టుపక్కల వారితో కలిసి పొలానికి వెళ్లి అపస్మారకస్థితిలో ఉన్న నగేష్‌ను 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నగేష్ శనివారం మృతి చెందాడు. అతని భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

కలలు సాకారం..



కేంద్ర బడ్జెట్ కేవలం లెక్కల పద్దు మాత్రమే కాదు. వికసిత్ భారత్‌కు ఒక రోడ్ మ్యాప్ వంటిది. రైతు సంక్షేమం నుంచి మధ్య తరగతి ఉపశమనం వరకు, మహిళలు, యువతకు సాధికారత కల్పించారు. మౌళిక సదుపాయాల కల్పన, పెట్టుబడులను ప్రోత్సహించారు. ఈ బడ్జెట్ ద్వారా దేశంలోని ప్రతిఒక్కరిని వారి కలలను సాకారం చేసే దిశగా సాగింది. భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా ఉంది.

– శాంతికుమార్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి

రాష్ట్రానికి అన్యాయమే..



రాష్ట్రంలో బీజేపీకి ఆరుగురు ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా కూడా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. పాలమూరు ఎత్తిపోతలకు ఈ బడ్జెట్‌లో మరోసారి మొండిచేయి చూపారు. ఐటీకి సంబంధించి రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు ప్రకటించలేదు. డిజిటల్ ఇండియా అని చెప్పే పీఎం మోదీ దానికి సంబంధించి ఏ ఒక్క రాయితీ కూడా ఇవ్వలేకపోయారు.

– ఒబేదుల్లా కొత్వాల్, చైర్మన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్

కార్పొరేట్లకు అనుకూల బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అనుకూలంగా ఉంది. ఉపాధి హామీ పథకానికి 86వేల కోట్లు మాత్రమే కేటాయించారు. తెలంగాణకు ఈ బడ్జెట్ వల్ల తీవ్ర అన్యాయం జరిగింది. జిల్లాకు మంజూరైన నవోదయ విద్యాలయానికి ఈబడ్జెట్‌లో నిధులు కేటాయించి పూర్తిచేయాలి.

– సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, మహబూబ్‌నగర్

ఢిల్లీ, బిహార్‌ల కోసమే..



కేంద్ర బడ్జెట్ ఢిల్లీ, బిహార్‌లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టినట్లుగా ఉంది. వైద్యంపై కొన్ని స్కీంలు ప్రకటించినా విద్యకు ప్రాధాన్యత ఇవ్వలేదు. గ్రామీణ ఉపాధి, రాష్ట్రంలోని ఆర్ఆర్ఆర్, మెట్రో విషయాలను ప్రస్తావించలేకపోయారు. జీతాలపై పన్ను మినహాయింపు ఇచ్చినా.. కొన్ని స్లాబ్‌లలో 25, 30 శాతం ట్యాక్స్ ఉండటం అభ్యంతరకరం.

– తిమ్మప్ప, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యోగులకు ఈ బడ్జెట్ ఊరట ఇవ్వగా మిగిలిన అన్ని వర్గాలకు నిరాశ పరిచిందనే చెప్పాలి. ఆదాయ పన్ను మినహాయింపు పెంచడంతో చాలావరకు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేదలకు మాత్రం చెప్పుకోదగ్గ రాయితీలు, కేటాయింపులు ప్రభుత్వం ప్రకటించలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన పాలమూరు జిల్లాకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు ఏమీ జరగలేదు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీహార్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు ప్రత్యేక కేటాయింపులు జరిగాయి. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు సైతం కేటాయింపుల కోసం ఎలాంటి ప్రయత్నం చేయలేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి, నెట్‌వర్క్

సముచిత స్థానం..



కేంద్ర బడ్జెట్‌లో అన్ని రంగాలు, అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించారు. ప్రధానంగా పేదలు, సామాన్యుల ప్రయోజనం కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్యాన్సర్ గుర్తించే విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం గొప్ప విషయం. అలాగే ఐదెకరాలు కలిగిన ప్రతి రైతుకు క్రెడిట్ కార్డు ఇవ్వడం బాగుంది. ఆదాయ పన్ను మినహాయింపు రూ.12 లక్షలకు పెంచడంతో మధ్య తరగతి వారికి మేలు జరుగుతుంది.

– శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌నగర్

ఉద్యోగులకు ఊరట



ఆదాయ పన్ను పరిమితి పెంచడంతో మధ్యతరగతి ఉద్యోగులకు బడ్జెట్‌లో భారీ ఊరట కలిగింది. గతంలో ఏడు లక్షలు ఉన్న పన్ను పరిమితిని 12లక్షలకు కేంద్ర ప్రభుత్వం పెంచింది. పన్ను స్లాబ్స్‌ను సవరించాలి.

– కృష్ణారెడ్డి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు, కల్వకుర్తి

తెలంగాణకు రిక్తహస్తం



కేంద్రం ఈసారి బడ్జెట్‌లో తెలంగాణకు రిక్తహస్తం చూపింది. మరోసారి ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రం పట్ల వివక్ష చూపారు. రాష్ట్రంలోని 8మంది బీజేపీ ఎంపీలు స్పందించాలి. వ్యవసాయ రంగంలో సంస్కరణలు పెట్టుబడిదారుల కోసమే అనేది స్పష్టమవుతోంది.

– ఎస్ఎండీ.ఫయాజ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు

కేంద్రం విఫలం..



ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. ఆదాయపు పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచుతున్నట్లుగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఎవరికి తెలియకుండా ఇంతకు ముందు పొందుతున్న ఇంటి అద్దె, లైఫ్ హెల్త్ ఇన్సురెన్స్, ఇంటి రుణం, వడ్డీ మినహాయింపులను రద్దు చేసి.. ఉద్యోగులకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగించింది. దీంతో ప్రతి ఉద్యోగి కచ్చితంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

– షేక్ ఫారుఖ్ హుస్సేన్, మహబూబ్‌నగర్

రాష్ట్రాన్ని విస్మరించింది..



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాన్ని పూర్తి విస్మరించింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకపోవడం, నంద్యాల–జడ్చర్ల, మునీరాబాద్–డోర్నకల్ నూతన రైల్వే లైన్లకు నిధులు కేటాయించలేదు. మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తున్న డీకే అరుణ 'పాలమూరు–రంగారెడ్డి'కి నిధులు సాధించకపోవడం ఆమె వైఫల్యం.

– బాల్‌నర్సింహ్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్

పన్ను మినహాయింపు పెంచడం..



మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయ పన్ను మినహాయింపు భారీగా పెంచడం హర్షనీయం. వేతన జీవులకు కేంద్ర బడ్జెట్ ఈసారి కాస్తంత ఊరటనిచ్చింది. ఎలాంటి వడ్డింపులు లేకుండా జీఎస్టీని కొనసాగిస్తూ, ఇతర పన్నులను విధించి ధరలను నియంత్రణకు యత్నించడం బాగుంది.

– పట్నం చెన్నయ్య, బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

జోగులాంబ వార్షిక బ్రహ్మోత్సవాలకు రండి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ.. చిత్రంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన ఈఓ, ఆలయ పాలకమండలి

అలంపూర్: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించినట్లు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్ ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం, ఆహ్వాన పత్రిక అందజేసినట్లు పేర్కొన్నారు. 3వ తేదీ వసంత పంచమి రోజున అమ్మవారి నిజరూప దర్శనం, సహస్ర ఘటాలతో అభిషేకం ఉంటుందని హాజరు కావాలని కోరామన్నారు. అదేవిధంగా ఈ నెల 25 నుంచి మార్చి 1 వరకు బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయని.. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికను కూడా అందజేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆలయ ధర్మకర్తలు సరస్వతి, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, గోపాల్, పులేందర్, వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు, జగన్‌మోహన్‌నాయుడు, జయరాముడు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు, ఎక్స్ ఆఫీషియో సభ్యుడు డి.ఆనంద్‌శర్మ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు

జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహోత్సవాలు శనివారం మూడోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, త్రిశతి, విశేష అర్చనలు, చండీహోమాలు, పవమాన సూక్త పారాయణం, పవమాన సూక్త హోమాలు, అవాహిత దేవతా హోమాలు, మండపారాధన, బలిహరణం, నీరాజన మంత్రపుష్పములు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో రెండ్రోజుల పాటు బ్రహోత్సవాలు కొనసాగుతాయని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. చివరిరోజు అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనున్నట్లు వివరించారు.

లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు






గాయపడిన వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు, ప్రమాదంలో దెబ్బతిన్న ప్రైవేటు బస్సులు

- వెనుక నుంచి మరో బస్సు ఢీ
- 12 మందికి గాయాలు

అలంపూర్ : జాతీయ రహదారిపై ఒక లారీ, రెండు బస్సులు ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడిన సంఘటన అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున జరిగింది. ఉండవెల్లి ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాలు.. పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలోని దూన్ దాబా వద్ద బండల లోడ్‌తో ఉన్న లారీ అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి కడపకు వెళ్తున్న సీజీఆర్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. అదే సమయంలో కావేరీ ట్రావెల్స్ బస్సు సీజీఆర్ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్లు బాబాసాహెబ్, చంద్రశేఖర్‌లతో పాటు ప్రయాణికులు సమీర, రోహిత్, ప్రసాద్, అజయ్, బాబు, సందీప్, శ్రీధర్, సావిత్రి, లక్ష్మిదేవి, ఓబుల్ రెడ్డి, జగదీష్, రాఘవరెడ్డి గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సీజీఆర్ ట్రావెల్స్ మేనేజర్ చెన్నమ్మ శెట్టి రెడ్డయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు.

చేపల వేటకెళ్లి ఇద్దరి మృతి



జోగు మల్లయ్య(ఫైల్)



సత్తయ్య(ఫైల్)

బల్మూర్: చేపల వేటకెళ్లి వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి చెందారు. నాగర్‌కర్నూలు జిల్లా బల్మూర్ మండలంలో కొండనాగులలో ఒకరు.. తిమ్మాజీపేట మండలం ఆవంచలో మరొకరు మృతిచెందారు. చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మూడు రోజుల తరువాత కుంటలో శవమై తేలిన సంఘటన బల్మూర్ మండలంలోని కొండనాగుల గ్రామంలో శనివారం చోటుచేసుకున్నట్లు ఏఎస్ఐ చాంద్‌పాష తెలిపారు. వివరాలు.. కొండనాగులకు చెందిన జోగు మల్లయ్య(45) గ్రామ సమీపంలోని నాగులకుంటలో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా చేపల వేటకెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఊర్లలో రెండు రోజులు వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం కుంటకట్టపై నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్తున్న కూలీలకు తేలిఉన్న శవం కనిపించడంతో ఒడ్డుపై అతని దుస్తులు, చెప్పులను గమనించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడికి భార్య చిట్టెమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆవంచలో..

తిమ్మాజీపేట: మండలంలోని ఆవంచలో ఎలికట్ట సత్తయ్య(42) అనే వ్యక్తి చేపల వేటకెళ్లి మృతిచెందినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. సత్తయ్య శుక్రవారం సాయంత్రం పొలానికి వెళ్తున్నానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా కనిపించలేదు. శనివారం ఉదయం చెరువు కట్టపై అతడి చెప్పులు, బట్టలను గుర్తించారు. చేపల వలలో చుట్టుకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన



గార్డెన్‌లో కర్ణాటక విశ్వవిద్యాలయం విద్యార్థులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌ను శనివారం కర్ణాటక విశ్వవిద్యాలయం విద్యార్థులు సందర్శించారు. దార్వాడ్‌లో వృక్షశాస్త్ర విభాగంలో ఎమ్మెస్సీ చదువుతున్న 51 మంది విద్యార్థులు, ముగ్గురు ఆచార్యులు, ప్రొఫెసర్ తంగాదురై ఆధ్వర్యంలో వారు గార్డెన్‌ను సందర్శనకు వచ్చారు. వారికి కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య స్వాగతం పలికారు. గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య గార్డెన్‌లోని వివిధ విభాగాలను చూయించి అవగాహన కల్పించారు. గార్డెన్‌ను విద్యార్థులు ఏర్పాటు చేయగా దాని బాగోగులు సైతం వారే చూసుకుంటున్నారని వివరించారు. గార్డెన్‌కు అనుబంధంగా ఉన్న జీవవైవిధ్య పరిశోధన విద్యాకేంద్రాన్ని సందర్శించి అక్కడ భద్రపర్చిన అతిపెద్ద జెర్రిపోతు కుబుసాన్ని, ఇటీవల జడ్చర్ల పరిసరాల్లో పట్టుకున్న పాములను చూశారు. గార్డెన్ సందర్శన అనంతరం ప్రొఫెసర్ తంగాదురై మాట్లాడుతూ అతి తక్కువ స్థలంలో ఇలాంటి గార్డెన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎక్కువ జాతుల మొక్కలు పెంచడం అద్భుతమన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

జడ్చర్ల: పట్టణ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ఓ కారు దగ్ధమైంది. ఎస్ఐ శివానందంగౌడ్ వివరాల మేరకు.. జడ్చర్లకు చెందిన రాజశేఖర్ రెడ్డి తన కారులో జిల్లా కేంద్రానికి వెళ్లి వస్తుండగా.. మయూరి నర్సరీ సమీపంలో బైక్‌ను ఢీకొట్టడంతో కారు ముందుభాగం ధ్వంసమైంది. అయితే కారును జడ్చర్ల మీదుగా హైదరాబాద్ వైపు తీసుకెళ్తుండగా.. ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారు డ్రైవర్‌తో పాటు రాజశేఖర్ రెడ్డి బయటికి రావడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

మల్దకల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన బాలుడు లైంగిక వేధింపులకు పాల్పడడంతో గమనించిన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లక్ష్మీచెన్నకేశవుడి ధ్వజారోహణం

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ధ్వజారోహణ పతాకావిష్కరణ చేస్తున్న పండితులు

జడ్చర్ల టౌన్: లక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛరణల, భక్తుల చెన్నకేశవ నామస్మరణల మధ్య ధ్వజారోహణం నిర్వహించారు. ధ్వజస్తంభంపై పతాకావిష్కరణ చేసి ధ్వజాదివాసం, ప్రాణప్రతిష్ఠ, బలిహరణం జరిపించారు. సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వానం చేశారు. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామికి పూజలు చేసుకున్నారు. రాత్రి హనుమాన్‌వాహనసేవలో భాగంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

నేడు కల్యాణం

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం జరిపించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

తాడిపర్తి లక్ష్మిసముద్రంలో భారీ మొసలి



గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తి లక్ష్మి సముద్రం చెరువులో భారీ మొసలి కనిపించడంతో సమీప పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వారం రోజులుగా చెరువు ఒడ్డుపై కనిపిస్తుందని.. దగ్గరగా వెళ్లే సరికి లోనికి వెళ్తున్నట్లు చెప్పారు. గొర్రె పిల్లలు, మేకలు తదితర మూగజీవాలు నీరు తాగేందుకు చెరువులోకి వెళ్తుంటారని.. అలాగే మత్స్యకారులు సైతం చేపల వేట చేపడతారని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు మొసలిని పట్టుకొని తీసుకెళ్లాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు. రెండు నెలల కిందట గోపాల్‌పేట అమ్మచెరువులో ఓ మొసలి కనిపించేదని.. అదే ఇప్పుడు ఈ చెరువులోకి వచ్చి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



నవాబుపేట: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు గ్రామాల్లో అధికారుల బృందం పర్యటిస్తుందని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. శనివారం ఆయన మండల అధికారులతో కలిసి కారుకొండ, కాకర్లపహాడ్, తీగలపల్లి, సిద్దోటం గ్రామాలు పర్యటించి తాగునీటి సమస్యలు తెలుసుకున్నారు. మేజర్ గ్రామాలు కారుకొండ, కాకర్లపహాడ్‌లో అత్యవసరంగా ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసిన తాగునీటి వనరులపై అధికారుల బృందం ఆరా తీసింది.

సోనియాగాంధీ దిష్టిబొమ్మ దహనం



జడ్చర్ల టౌన్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై వివాదాస్పద వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సోనియాగాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆపార్టీ అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ మాట్లాడుతూ దేశమొదటి మహిళనుద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. గిరిజన మహిళను అవమానించటం సరికాదన్నారు. సోనియాగాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మోహన్‌నాయక్, మహేందర్‌నాయక్, ఎంబీ బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, రమేష్‌జి, బుక్కనవీన్, శ్రీనివాస్‌గౌడ్, నడిమింటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు తరలిన జిల్లా జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: మంచిర్యాలలో నేటి(ఆదివారం) నుంచి ఈనెల 4వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ రగ్బీ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్లు శనివారం తరలివెళ్లాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జట్లను జిల్లా రగ్బీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు అభినందించారు. రాష్ట్రస్థాయి టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, పీడీలు వేణుగోపాల్, రమేష్‌బాబు, విష్ణు, కోచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తపస్ నూతన కార్యవర్గం ఎన్నిక

దేవరకద్ర: తపస్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో దేవరకద్రలో జరిగిన తపస్ ఉపాధ్యాయుల సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. తపస్ కమిటీ మండల అధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, మహిళా అధ్యక్షురాలిగా సుశీల, గౌరవాధ్యక్షులుగా నాగేశ్వర్‌రెడ్డిని ఎంపిక చేశారు.

కౌకుంట్ల కమిటీ...

కౌకుంట్ల మండల తపస్ కమిటీ అధ్యక్షులుగా తిప్పారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జోగి నరసింహ, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా కళ్యాణి ఎన్నికయ్యారు. ఎంఈఓ బలరాం, సంఘం ప్రతినిధులు తిరపతయ్య, సురేష్, విజయలక్ష్మీ, సుధాలక్ష్మీ, అఫ్రీన్, స్వరూప, తిరుపతమ్మ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల తపస్ నూతన కమిటీని మండలంలో ఆ యూనియన్ రాష్ట కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తపస్ మండల కమిటీ అధ్యక్షుడిగా కుమారస్వామి, గౌరవాధ్యక్షులుగా బి.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్‌రెడ్డి, కోశాధికారిగా వెంకట్‌రాములును ఎంపిక చేశారు. కార్యక్రమంలో తపస్ ఉపధ్యాయ కమిటీ సభ్యులు తిరుపతయ్య, సురేష్, సుధాలక్ష్మి, తిరుపతమ్మ, అఫ్రీన్, స్వరూప, విజయలక్ష్మి, శ్రీకాంత్‌తో పాటు పలువురు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోయిల్‌కొండ: మండలంలోని కుస్మద్‌పల్లితండాలో రూ.6లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్ తెలిపారు. శనివారం పనులను ప్రారంభించి నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బ్లాక్ కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్‌గౌడ్, సత్యపాల్‌రెడ్డి, మహేందర్, బండి యాదవ్‌కుమార్, రవినాయక్, విఠల్, రామస్వామి, థావుర్యానాయక్, భాస్కర్‌నాయక్, ఆంజనేయులు, రామునాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యకు మహర్దశ

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- కోడూర్ కేజీబీవీలో సైన్స్ ల్యాబ్, ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం



కోడూర్ కేజీబీవీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో విద్యకు మహర్దశ ప్రారంభమైందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోడూర్ గ్రామ సమీపంలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో తన సొంత నిధులతో ఇంటర్ విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన సైన్స్ ల్యాబ్‌ను, ముడా నిధులతో ఏర్పాటుచేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కేజీబీవీ కళాశాలలో తల్లిదండ్రులు లేని 11మంది విద్యార్థినులను కాంగ్రెస్ నాయకులు వారి సంరక్షణను ఈ ఏడాది పాటు చూసుకుంటారని, ఇది ఒక ప్రయత్నంగా బాధ్యతగా భావించాలన్నారు. ఎమ్మెల్యే కూడా ఒక విద్యార్థిని సంరక్షణ బాధ్యతను తీసుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కేజీబీవీ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ, ఎంఈఓ కృష్ణయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు రామచంద్రయ్య, మాధవరెడ్డి, యాదయ్యగౌడ్, గోవింద్‌యాదవ్, రంగయ్య, కొండయ్య, రాజు, ప్రవీణ్‌కుమార్, రియాజ్, ఆంజనేయులు, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి' అమలులో నిర్లక్ష్యం వద్దు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం అమలులో నిర్లక్ష్యం వహించొద్దని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ ఎంప్లాయీస్ 1104 యూనియన్ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాండు, విజయ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

దేశానికి ప్రాతినిధ్యం వహించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: ఒలింపిక్ క్రీడల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విశాఖపట్నంలో ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు అంతర్జాతీయ కరాటే పోటీలకు వెళ్తున్న కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా విద్యార్థులను ఎమ్మెల్యే సన్మానించారు. మహబూబ్‌నగర్ విద్యానిధి నుంచి రూ.25వేల ఆర్థికసాయాన్ని క్రీడాకారుల ఖర్చుల కోసం అందజేస్తామని హామీ ఇచ్చారు. కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ, జకీ, కింగోషోటోకాన్ ప్యాట్రన్ లక్ష్మణ్, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్, కోశాదికారి తిరుపతయ్య, కౌసర్ జహా, నాజియ, ఆంజనేయులు, అనూష, మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆదాయానికి గండి

- 12వ వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్
- వ్యాపార సముదాయాలకు లెక్కప్రకారం పన్ను విధిస్తాం
- మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ నిర్ణయం



మున్సిపల్ సమావేశంలో కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్ పర్సన్ పుష్పలత

జడ్చర్ల టౌన్: రోడ్లపై గృహ వినియోగ పన్ను కడుతూ వ్యాపార సముదాయాలకు అద్దెకు ఇవ్వడంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతుందని 12వ వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయా శాఖల పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ పాలాది సారికతో పాటు కౌన్సిలర్లు హాజరయ్యారు. మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార సముదాయాలకు లెక్క ప్రకారం పన్నులు విధించటంతో పాటు 100శాతం వసూలు చేయాలని కమిషనర్, చైర్‌పర్సన్, కౌన్సిలర్లు నిర్ణయించారు. ఈసందర్భంగా రఘురాంగౌడ్ మాట్లాడుతూ హౌసింగ్‌బోర్డు మొదలుకొని ప్రధాన రోడ్లతోపాటు అన్నికాలనీల్లోనూ వ్యాపార సముదాయాలుగా మారిన ఇళ్లను గుర్తించి సక్రమంగా పన్నులు విధించాలన్నారు. తనవార్డు నుంచే శ్రీకారం చుట్టాలని సూచించారు. ఈ విషయంలో అయా వార్డుల్లోని కౌన్సిలర్లు అందరం సహకరిస్తామని హామీఇచ్చారు. కొలతల ప్రకారం వ్యాపార సముదాయాలకు పన్నులు విధిస్తే తాము అడ్డుకోమని కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ప్రకటించారు. మున్సిపాలిటీలో 100శాతం పన్నులను వసూలు చేయాలని, ఎవరికి మినహాయింపు ఇవ్వరాదని చర్చించారు. రానున్న వేసవికాలం దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చూడాలని, హ్యాండ్‌బోర్లు, ఇతర బోర్లను సరిచూసుకోవాలని నిర్ణయించారు. లీకేజీలుంటే వాటిని సరిచూసుకోవాలని సూచించారు. 15వ వార్డు మార్కెట్‌యార్డు (గంజ్) రోడ్డుపై సమావేశంలో చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు వైస్‌చైర్‌పర్సన్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గంజ్‌లో రోడ్డును ఆక్రమించి షెడ్లు, ర్యాంప్‌ల నిర్మాణం చేపట్టడాన్ని అందరూ వ్యతిరేకించారు. నిర్మాణాలకు సంబంధించిన డాక్యుమెంట్లు సమర్పించాలని నోటీసులు జారీ చేయగా కేవలం నలుగురు మాత్రమే ఇచ్చారని కమిషనర్ లక్ష్మారెడ్డి వివరించారు. మిగిలిన వాళ్లు డాక్యుమెంట్లు ఇస్తేనే సమస్య పరిష్కరించగలమన్నారు. అయితే ఉన్నది ఉన్నట్లుగానే మురికికాల్వ నిర్మించాలని వైస్ చైర్‌పర్సన్, ఆమె భర్త పట్టుబట్టడంతో వివాదం పెరిగింది. సోమవారం గంజ్ ప్రాంతం సందర్శించి అందరి డాక్యుమెంట్లు పరిశీలించాలని నిర్ణయించారు.

అధిక దిగుబడులు వచ్చేలా పరిశోధనలు

- శాస్త్రవేత్త డా.లక్ష్మమ్మ



ఆముదం పొలంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు

భూత్పూర్: రైతులు ఆముదం పంటను విరివిగా సాగుచేయాలని ఆముదం, జాతీయ నూనెగింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా. లక్ష్మమ్మ అన్నారు. శనివారం మండలంలోని కప్పెటలో మోహన్, కుర్మయ్య పొలంలో ఆముదం క్షేత్ర దినోత్సవాన్ని ఏర్పాటుచేయగా ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఆముదం పంటను 100–120 రోజుల్లో అధిక దిగుబడి వచ్చే దిశగా పరిశోధనలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఆముదం సంకరం ఐసీహెచ్–5 విత్తనాన్ని యాసంగిలో సాగుచేశారని, కొత్త సంకరాల రూపకల్పనలో భాగంగా పాలెం ప్రాంతీయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు పీసీహెచ్–596ని రూపొందించినట్లు ఆమె వివరించారు. ఆముదం విభాగం శాస్త్రవేత్తలు డా.ఎస్.నళిని, డా.కె.నర్సయ్య, డా.ఈశ్వర్‌రెడ్డి, డా.దివ్యరాణి, డా.మాధురి, పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

మాచేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహించాలి



మాచేశ్వర స్వామి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న రజక సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రజక కుల దైవమైన మాడివాల మాచేశ్వర సామి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రజక సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు శివన్న, జిల్లా అధ్యక్షుడు నాగన్న డిమాండ్ చేశారు. స్థానిక టీడీగుట్ట మైదానంలో మాచేశ్వరస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివన్న మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా రజకులు వెనుకబడి ఉన్నారన్నారు. పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణముదిరాజ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబ, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, పట్టణ గౌరవ అధ్యక్షుడు యాదేశ్‌కుమార్, ఉద్యోగ సంఘం నాయకులు సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాగేష్, యాదయ్య, రఘునందన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించినప్పుడే విజయం



కోయిల్‌కొండ: విద్యార్థులు ఒత్తిడిని జయించినప్పుడే విజయం సాధిస్తారని సైకాలజిస్ట్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని పారుపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చదువుపై దృష్టి పెట్టేలా విద్యార్థులకు కొన్ని సూచనలుఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని స్పందన ఈదా ఫౌండేషన్, వందేమాతరం ఫౌండేషన్ వారు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయమ్మ, ఉపాధ్యాయులు వంశీలత, మహేందర్, భాస్కచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గండేడ్: మండలంలోని సల్కర్‌పేట్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు ఫీడర్ల పరిధిలోని సల్కర్‌పేట్, గండీడ్, రెడ్డిపల్లి, జంగంరెడ్డిపల్లి, చెన్నయపల్లి, అంచన్‌పల్లి, రంగారెడ్డిపల్లి, కొండాపూర్, మల్సూర్‌పల్లి, మల్సూర్‌పల్లితండా, బల్సూర్‌గొండ, పంచలింగాల్‌తండాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ ఉండదని పేర్కొన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రాజాపూర్ : మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి 3గంటల వరకు గ్రామంలో విద్యుత్ వీధి దీపాల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖాధికారి వెంకటేష్ శనివారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఆరెకే స్పోర్ట్స్ కరాటేడూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎంపీకేప్–2025 కరాటే ఒపెన్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు మాస్టర్ కె.రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి దాదాపు 500మంది కరాటే విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. కటా, కుమితే, టీమ్ కటా, వెపన్ అంశాల్లో పోటీలు ఉంటాయని సూచించారు. ప్రతిభచాటిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ ట్రోఫీలు అందజేస్తామని, ఈపోటీల ప్రారంభోత్సవానికి ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

వరుణ్ చక్రవర్తికి కలెక్టర్ అభినందనలు



వరుణ్ చక్రవర్తిని అభినందిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, డీఈఓ ప్రవీణ్‌కుమార్ తదితరులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బాలానగర్ మండలం చిన్నరేవల్లి ఎంపీహెచ్‌ఎస్ చెందిన విద్యార్థి వరుణ్ చక్రవర్తి గత నెలలో పాండిచ్చేరిలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌లో స్పెషల్ ప్రైస్ సాధించాడు. శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఆవిద్యార్థిని కలెక్టర్ విజయేందిర బోయి అభినందించారు. అనంతరం విద్యార్థి ప్రదర్శనకు సంబంధించిన పూర్తి వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గణితంలో ఈ విద్యార్థి చేసిన టీచింగ్ ఎయిడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, గణితంలో వెనుకబడిన వారికి ఉపయోగపడుతుందని గైడ్ టీచర్, విద్యార్థి తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మోహన్‌రావు, డీఈఓ ప్రవీణ్ కుమార్ గారు, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, గైడ్ టీచర్ అశోక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలందిస్తాం

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



అడ్డాకులలో 108 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల, పొన్నకల్ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. అడ్డాకుల పీహెచ్‌సీ వద్ద 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. పొన్నకల్‌లో కామన్ హాల్ నిర్మాణం, సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలోని వాగుల్లో ఎక్కడ కూడా ఇసుక తీయనీయడం లేదని, పొన్నకల్ వద్ద కూడా వాగులో ఇసుక తీయనీయని చెప్పారు. పొన్నకల్‌కి రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఇప్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తోట శ్రీహరి, నాగిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, జగదీశ్వర్, లింగారెడ్డి, హేమవర్ధన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, ధర్మారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చిన్నచింతకుంట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నచింతకుంట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ ఇళ్ల నమూనా నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వద్ద అంబులెన్స్‌ను ప్రారంభించారు. దమగ్నాపూరం గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరుపత్రాలను అందజేశారు. గ్రామంలోని వాల్మీకి దేవాలయానికి మంజూరైన రూ.4లక్షల ప్రొసీడింగ్‌లను వాల్మికి సంఘం నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్లయ్య, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కురుమూర్తి స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, నాయకులు గంజి బాల్‌రాజు, వట్టేంశివ, గూడూర్ శేఖర్, ప్రతాప్, శేఖర్ ఉన్నారు.

వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం

- ఉద్యోగుల జేఏసీ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ



అడిషనల్ డీఆర్డీఓ ముసాయిదాబేగంకు వినతి పత్రం సమర్పిస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈజీఎస్‌లో పనిచేసే ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగులకు కొన్ని నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని ఈజీఎస్ ఉద్యోగుల జేఏసీ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. పెన్‌డౌన్ కార్యక్రమంలో శనివారం విధులకు హాజరై ఎలాంటి పని చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అడిషనల్ డీఆర్డీఓ ముసాయిదాబేగంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తుందని వాపోయారు. పెట్రోల్ చార్జీలకు కూడా ఇక్కట్లు తప్పడం లేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు పోయేందుకు కూడా వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి శాంతకుమార్, రవికుమార్, చంద్రశేఖర్, శృతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నివిధాలా సహకారం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వయోవృద్ధులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని నగర వయోవృద్ధుల సంక్షేమ కమిటీ కన్వీనర్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఈసంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. ఎవరైనా బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే టోల్‌ఫ్రీ నం.14567కు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. టోల్‌ఫ్రీ నంబరును నగరంలోని ముఖ్యకూడళ్లలో అందరికీ కనిపించేలా రాయించాలని కమిటీ సభ్యులు సూచించగా అందుకు ఆయన అంగీకరించారు. ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మి, సీడీపీఓ రాధిక, వన్ టౌన్ సీఐ అప్పయ్య, ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, కార్యదర్శి నాగభూషణం పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



తెలంగాణ బాల, బాలికల జట్లతో నర్సింహారెడ్డి, రాంరెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ.నర్సింహారెడ్డి అన్నారు. గత నెలలో జిల్లా కేంద్రంలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి అండర్–17 హ్యాండ్‌బాల్ టోర్నీలో చాంపియన్లుగా నిలిచిన తెలంగాణ బాల, బాలికల జట్లను శని వారం హైదరాబాద్‌లో ఆయన అభినందించారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాంరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, గుండుమాల్ టీజీఎంఎస్ పీడీ బాల్‌రాజు, ఎండీ. జియావుద్దీన్, అహ్మద్ హుస్సేన్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయడానికి సిద్ధం

భూత్పూర్: ఫీల్డ్ అసిస్టెంట్లు సమ్మెలో పాల్గొంటున్నారని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, గ్రామస్థాయిలో తాము పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణగౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు తాము సమ్మెలో పాల్గొనడం లేదంటూ శనివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ ఏపీవో, ఈసీలు, టీఏలు, సీఓలు చేపడుతున్న సమ్మెతో తమకు సంబంధం లేదన్నారు. ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు అంజిలయ్య ఉన్నారు.

ఇష్టంతో చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చు

రాజాపూర్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చని ఎంఈఓ సుధాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులకు ఎస్ఐ లెనిన్ జన్మదినం సందర్భంగా పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ఎస్ఐ లెనిన్‌పై ఉన్న అభిమానంతో పాఠశాలలో వలంటీర్‌గా పనిచేస్తున్న సతీష్‌రాథోడ్ విద్యార్థులకు ప్యాడ్లను అందించగా ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు మోజెస్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాలపై అభిప్రాయాల సేకరణ

నవాబుపేట: ఎంపీటీసీల స్థానాలపై శనివారం అఖిలపక్ష పార్టీ సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. ఎంపీటీసీల స్థానాల విషయంలో ప్రజలు, పార్టీల అభిప్రాయాలు సేకరించి వారి సూచనతో 3వ తేదీన జాబితా ఖరారు చేసి ఎంపీటీసీ స్థానాలు ప్రకటిస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని సలహాలు ఇచ్చారు.

ఆలయానికి బీరువా వితరణ

రాజాపూర్: స్థానిక శ్రీ శివసీతారామాంజనేయ స్వామి ఆలయానికి షాద్‌నగర్‌కు చెందిన అభిలాష్ దేవాలయ సామాన్లు భద్రపర్చుకునేందుకు శనివారం బీరువాను అందించారు. ఈసందర్భంగా అభిలాష్‌ను ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నర్సింహులు, రాము పాల్గొన్నారు.

10శాతం భూమిని పంచాయతీకి అప్పగించాలి

మిడ్జిల్: మండల కేంద్రంలో ఇరవై ఏళ్ల క్రితం పంచాయతీ లేఔట్ చేసిన వెయిన్‌టో వెంచర్‌లో 10శాతం భూమిని పంచాయతీకి అప్పగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు వినతి పత్రం అందజేశారు. నాయకులు రాజేశ్వర్, తిరుపతి, నరేష్‌నాయక్, జంగిలయ్య,రవింద్ర, అరవింద్, శేఖర్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన విఫలం

పాలమూరు: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన మండల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, బూత్ కమిటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ప్రదీప్‌కుమార్‌కు నియామకపత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని బూత్ స్థాయి నుంచే బలోపేతం చేయాలన్నారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీజేపీని విస్తరించే విధంగా కష్టపడాలని సూచించారు. జిల్లాలో పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు కలిసి పార్టీని క్షేత్రస్థాయిలో విస్తరించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతిబూత్‌లో బీజేపీ జెండా ఎగరాలని, కేంద్రం నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటి ప్రచారం చేపట్టాలని అన్నారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ సహ ఇంఛార్జీ పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం 2-2-2025



సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి



డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్



కేలా రెనెకి / నికీ ప్రసాద్

నేడు మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు
- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్-19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారీ భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అభేద్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తే లేదు!

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కెలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కె (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకి కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబో మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు



నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్
- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4-1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్-4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌ల తోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.

2-3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2-0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6-2, 6-1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-0, 6-2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది




'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

-'దిల్' రాజు

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ–''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్, కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.

అరుదైన గౌరవం



'తంగలాన్'లో విక్రమ్



'గామి'లో విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్



కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమెరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.

స్క్రీన్స్ పెరగడం ఆనందం

- విష్ణువర్ధన్



విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ–''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.

సస్పెన్స్



ఆర్పీ పట్నాయక్, సురేష్

రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ–''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.

సూర్యాపేట్ నేపథ్యంలో....




ఈశ్వర్, నైనా

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ– ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.

ఓటీటీ ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండితెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

– ఇంటూరు హరికృష్ణ